# ఆంధ్రభూమి మాసపత్రిక

డెక్కన్ క్రోనికిల్ సంస్థనుంచి- 1978లో ఆరంభించబడి 30 సంవత్సరాలుగా నిరవధికంగా కొనసాగుతోంది ఆంధ్రభూమి మాసపత్రిక. ప్రస్తుతం ఎడిటర్ టి. వెంకట్రామ్‌రెడ్డి, న్యూస్ ఎడిటర్ ఎ.ఎస్. లక్ష్మి. ప్రతి సంచి కనీ ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్న సంపాదకవర్గం అభినందనీయం. పత్రికకి సీరియల్స్ పంపేవారు రచన తోపాటు ఇతివృత్తాన్ని (క్లుప్తంగా 3 పేజీల్లో) జతపర్చి పంపాలి. నిడివిలో- కథలు 8-12 పేజీలు, మినీ నవల 80-120 పేజీలు ఉండాలి. ప్రచురణకి స్వీకరిస్తే ఆ విషయం తెలియబర్చబడుతుంది. ప్రచురించబ డిన రచనలకి పారితోషికముంటుంది. కాంప్లిమెంటరీ కాపీ పంపే సంప్రదాయం లేకున్నా- వ్రాసినవారు పత్రిక ఆఫీసుకి వెడితే సగౌరవంగా కాపీ అందజేస్తారు. కుదరనివారు పత్రికకోసం తమ ఏర్పాట్లు తామే చేసుకోవాలి. ఇది ఒక విధంగా మంచిదే- తమ రచనకోసమే కాకుండా రచయిత(త్రు)లు పత్రికని చూసే మంచి అలవాటు చేసుకోవచ్చు. మెరుగైన రచనలకోసం అప్పుడప్పుడు పోటీలు నిర్వహిస్తూ, ఎందరో పాత, కొత్త రచయితలకి ఆలంబనగా, పాఠకులకి విజ్ఞానవినోదదాయకంగా కొనసాగుతున్న ఈ 130-పేజీల పత్రికకి మచ్చుగా ఫిబ్రవరి 2009 సంచికని పరిశీలిద్దాం.

అట్టమీద పరమ శివుడు. అట్ట వెనుక అందాల తార. అట్టలోపల ఓ రమణీయ శ్లోకానికి కమనీయ భావం.

మొదటి పేజీలో ప్రత్యేకంగా అలరించే కార్టూన్స్. ఆ వెంటనే 'ఇది మీ వ్యూ' అంటూ పాఠకుల ఉత్తరాలు. తర్వాత నాలుగు సీరియల్స్ (వీటిలో ఒకటి ప్రముఖ ఆంగ్ల రచయిత వుడ్‌హౌస్ రచనకు అనుసరణ), మధ్యమధ్య సరదా కార్టూన్లు, కులాసా కబుర్లు, వెండితెర ముచ్చట్లు. వార్తలని విశ్లేషించే హాస్య వ్యంగ్య వార్తలు-వాతలు (పేజి 14). ప్రాచీన సాహిత్యంపై సంస్కృతీ ప్రహేళిక (24), ప్రజా సమస్యలకి పాఠకుల సూచనగా 'చెప్పాలని ఉంది' (34), సభలు, సమావేశాల సమాచార వేదిక (42), జాతకం చెప్పే 'అంకెల అదృష్టం' (44), మెదడుకు పదును పెట్టే 'పదమ వ్యూహం' (48), వరుసగా తొమ్మిది కథల 'కథావేదిక' (53), వివిధ అంశాలపై సమయ, సందర్భోచిత వ్యాసాలు, 'ఛాయాగీతం ఫొటో కవితలు'-పోటీ (96), ఏ ఆడ్డంకులూ లేకుండా కేవలం రచనకే పరిమితమైన మినీ నవల (99).

వీటన్నింటి విలువా నెలకి ఎనిమిది రూపాయలు.